## కాళేశ్వరం కట్టిన కేసీఆర్‌కు నోటీసులు జారీచేయడం బాధాకరం



కేపీహెచ్‌బీ కాలనీ : రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేలా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం బాధాకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. అవినీతికి తావు లేకుండా తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా నోటీసులు జారీ చేసిందని, కడిగిన ముత్యంలో కేసీఆర్ బయటికి వస్తారన్నారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీలలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పటిష్టంగా ఉందని, ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. తొలి సీఎం కేసీఆర్, కేటీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడడం సరికాదన్నారు. బడేబాయ్ చోటే బాయ్ లను.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రశ్నిస్తామన్నారు. తెలంగాణ ప్రజలందరూ కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# ఆవిర్భావ వేడుకలు వైభవంగా జరుపాలి

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 31: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం శేరిలింగంపల్లి నియోజక వర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది అని, పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగెత్తి పోయారని, సంక్షేమం అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజల్ని హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల వద్ద డబ్బులు వసూలు చేయడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన తొలి సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు కుట్రపూరితంగా నోటీసులు ఇస్తున్నారని, దీనిని వ్యతిరేకిస్తూ.. ప్రతి నాయకుడు, కార్యకర్త సీఎం కేసీఆర్‌కు మద్దతు పలుకుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపాలన్నారు. ఎన్ని కుట్రలు చేసిన మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలను పరిష్కరించాలని సూచించారు.



శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

### ముంపు సమస్య తలెత్తకుండా చూడాలి

వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్, శ్రీరామ్ నగర్ కాలనీలో కల్వర్టును అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో నీరు సజావుగా పల్లానికి ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కైత్లాపూర్‌లో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ శంకర్, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, స్థానిక నాయకులు సంతోష్ కుమార్, యాదయ్యగౌడ్, నవీన్, రాజేశ్, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కైత్లాపూర్‌లో ముంపు సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారులు



## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కేపీహెచ్‌బీ కాలనీ, మే 31: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం క్యాంప్ ఆఫీసులో ఆల్విన్ కాలనీకి చెందిన ఎన్.నిఖిత కు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ



బాలానగర్ డివిజన్ పరిధి చిత్తారమ్మ బస్తీలోని అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవిష్కరించారు. శనివారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, స్థానికుడు ఆకుల నరేందర్‌తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్తారమ్మ బస్తీలో అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బస్తీవాసులందరూ ఆంజనేయస్వామిని దర్శించి తరించాలని సూచించారు.

- బాలానగర్

## కార్యవర్గ సభ్యులకు అభినందనలు



అల్లాపూర్, మే 31 : మోతీనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షుడిగా కమిటీను ఏర్పాటు చేసుకున్నారు. శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. డెవలప్‌మెంట్ ప్యానెల్ నుంచి అత్యధికంగా గెలుపొందిన ఆరుగురు సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పి.ఎ.ఎస్.మూర్తి, సీతారామయ్య, సుధారాణి, రమేశ్ అయ్యంగార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ పర్యటన



పైపులైన్ రోడ్డులో వంతెన బ్రిడ్జిని పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్

కుత్బుల్లాపూర్ : రామ్‌రెడ్డి నగర్ సుచిత్ర జాతీయ రహదారిని కలుపుతూ.. ఫాక్ సాగర్ చెరువు పక్కనుంచి వెళ్లే 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులతో పాటు జీడిమెట్ల పైపు లైన్ రోడ్‌లోని స్టీల్ బ్రిడ్జ్‌ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ శనివారం పర్యటించారు. 480 ఎకరాల విస్తీర్ణం గల ఫాక్ సాగర్ చెరువు అందులో నుండి వెళ్లే నాలా కబ్జాకు గురైందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఇరిగేషన్ అధికారులు చెరువు కబ్జాకు గురవుతుందనీ ఎన్ని సార్లు ఫిర్యాధు చేసిన కబ్జారాయుళ్ళతో కుమ్మక్కై, అక్రమార్జనకు తెరలేపారని కమిషనర్‌కు వివరించారు. ఇరిగేషన్ అధికారుల పై అవినీతి ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కమిషనర్‌ను ప్రశ్నించేందు వెళ్తుండగా పలువురు మీడియా ప్రతినిధులపై ఇరిగేషన్ అధికారులు దురుసుగా ప్రవర్తించి, కవరేజ్ చేస్తున్న వారి సెల్‌ఫోన్లు లాక్కుని, విసిరేశారు. మీడియా ప్రతినిధులపై ఇరిగేషన్ అధికారులు దౌర్జన్యం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారుల తీరిపై స్థానికులు మండిపడుతూ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్ : శానిటేషన్ విభాగఅధధిఅధధిఅధధి అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సురక్షితమైన వాతావరణం అందించడం లక్ష్యంగా ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఉదయం వీధివీధిన తిరుగుతూ శానిటేషన్ విభాగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రజల నుంచి వస్తున్న పలు ఫిర్యాదులపై స్పందించిన అధికారులు ఎట్టకేలకు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి తమ సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయా వీధిలో ఉన్న ప్రజలు అధికారుల దృష్టికి శానిటేషన్ అంశంపై పలు ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ కృష్ణారెడ్డి తమ సమస్యలను త్వరితన పరిష్కరించడంతోపాటు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది ఐక్యమత్యంతో పని చేయాలని పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొంపల్లి చౌరస్తాలో శానిటరీ విభాగం పై సిబ్బందికి సూచనలు చేస్తున్న కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణారెడ్డి



## భరతనాట్య ప్రదర్శన

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓంకార పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ చెన్నై నిర్వాహకులు గురువు, నాట్యరత్నం ప్రతీష్ శివానందం, షీబా ప్రతీష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలు అలరించింది. మోనిష, సాధనశ్రీ , జోషిక ,జీవన, కార్తీక, పూర్విత, నేత్ర, శుభశ్రీ, మేఘశ్రీ ప్రదర్శించిన తీరు అలరించాయి.

- కొండాపూర్

## కమనీయం..కూచిపూడి ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించిన కళాకారులు

మాదాపూర్ : అన్నమాచార్య భావన వాహినిలో పద్మశ్రీ, డా. శోభరాజు ఆధ్వర్యంలో శనివారం కూచిపూడి ప్రదర్శన ఏర్పాటు చేశారు. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రం, అన్నమయ్య అష్టోత్తరం, అన్నమ గాయత్రి, గురు స్తుతితో ప్రారంభించారు. శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామికి నృత్యార్చన సమర్పించిన అనంతరం శ్రీ కృతి కూచిపూడి డాన్స్ అకాడమీ గురువు లలితా రమేశ్ బృందం పి. శ్రీకృతి, ఋత్విక జి, కే. జగ్వి, పి. నిహారిక రెడ్డి, పి. వైష్ణవి, జాహ్నవి నాగ వరద, హృత్వి నాగ జయ, గులివె సన్నిధ్, శాన్వి, ఆర్.హశ్విత, బి.సమన్వి, డి.గీతాన్విత, చరిష్మ, కె. తన్మయి, సి. లోలితాలిన ప్రతీక, పి. చైత్ర, విద్య, అక్షయ, కోడూరి సమన్వి, సీహెచ్. త్రిషిక, శివాన్షి సాహు, జి. గాయత్రి, డి. శివరుత్విక, వి. ప్రసూన, ప్రణీత, ధృతిక అలరించారు. అన్నమాచార్య భావనా వాహిని పక్షాన సంస్థ నిర్వాహకులు అర్చనా కోదాటి, రాజరాజేశ్వరి కళాకారులకు జ్ఞాపికలు బహూకరించారు. శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి మంగళ హారతి ఇచ్చి తీర్థ ప్రసాదలను అందజేశారు.

## ప్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు



మియాపూర్ : నో టొబాకో డే సందర్భంగా ఏఎస్ రాజు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ప్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను శనివారం కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. డా.శ్రావణి కుమారి, డా.ప్రభాకర్ , డా. సాయి మనోజ్ , సాయిబాబా ఉచితంగా టెస్టులు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావు , ఏఎస్ రాజు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు నర్సింహా నాయుడు, పీఎస్ రాజు, నర్సింహా రెడ్డి, ఏకాంబరం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కిలాడీ లేడి

- మాయమాటలతో మోసాలు చేయడంలో దిట్ట
- హైకోర్ట్ న్యాయవాదినని.. న్యాయమూర్తినంటూ బిల్డప్
- హైకోర్టులో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం
- 100 మందికి పైగా అమాయకులు మోసం
- కోట్లు కొట్టేసిన మాయలాడి
- జడ్జినని సీఐని నమ్మించి వేములవాడలో ప్రత్యేక దర్శనం
- కరీంనగర్‌లో మాయలేడిని అరెస్ట్ చేసిన మధురానగర్ పోలీసులు

వెంగళరావునగర్, మే 31 : అమాయకులే ఆ మాయలేడి టార్గెట్.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి కోట్ల రూపాయలు కొట్టేసింది... హైకోర్టు న్యాయవాదినని ఓసారి..న్యాయమూర్తినని మరోసారి మాయ మాటలతో బోల్తా కొట్టించింది.. చివరికి కరీంనగర్‌లో ఆ కంత్రీ కిలాడిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై శివశంకర్ కథనం ప్రకారం.. అంబర్‌పేట్‌కు చెందిన బితుకు ప్రసన్న రెడ్డి ( 45 ) మోసాలు చేయడంలో ఆరితేరింది. వెంగళరావునగర్‌లో ఉండే ఎస్. జీవన్ (35) ఉద్యోగాన్వేషణలో ఉండగా.. ఆమె పరిచయమైంది. హైకోర్టు న్యాయవాదినైన తనకు చాలా మంది జడ్జిలతో పరిచయాలు ఉన్నాయని.. రూ.15 లక్షలు ఇస్తే హైకోర్టులో రికార్డు పోస్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని జీవన్‌ను నమ్మించింది. ఆమె మాటలు నమ్మిన అతను ముందుగా రూ.6.5 లక్షలు ఇచ్చాడు. మిగతా రూ.8.5 లక్షలు వసూలు చేసేందుకు శైలజారెడ్డి అనే మహిళను హైకోర్టు న్యాయమూర్తిగా పరిచయం చేసింది. ఆమె అసిస్టెంట్ ఫిరోజ్ ఖాన్ అని చెప్పి వారిద్దరిని పరిచయం చేసింది. ఆరు నెలలు గడిచినా ఉద్యోగం రాలేదు. ఈ నేపథ్యంలో రవి అనే వ్యక్తి ఫోన్‌చేసి తాను ప్రసన్న రెడ్డి చేతిలో మోసపోయానని.. ఉద్యోగం కోసం ఆమెకు రూ.4.5 లక్షలు ఇచ్చానని చెప్పాడు. ఈ క్రమంలో ప్రసన్నరెడ్డికు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రాగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే.. తాను హైకోర్టు జడ్జినంటూ వేములవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను మాయమాటలతో బోల్తా కొట్టించి.. దర్శనానికి పోలీసు భద్రత కల్పించాలని కోరి.. ప్రత్యేక దర్శనం చేసుకుంది.

**100 మందినిపైగా మోసం..**

సుమారు 100 మందికి పైగా నిరుద్యోగులను హైకోర్టులో ఉద్యోగాల పేరిట మోసం చేసింది. ఒక్కొక్కరి నుంచి రూ. 3 నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసింది. నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు. తన వద్ద పనిచేసే డ్రైవర్లకు కూడా హైకోర్టులో ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు చేసింది. ఓ మహిళ భర్తతో గొడవ పడి దేవాలయానికి వస్తే..తాను అడ్వకేట్ అని నమ్మించి విడాకులు ఇప్పిస్తానని .. హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె నుంచి రూ.3 లక్షలు కాజేసింది. అంతే కాకుండా ఆమె ద్వారా ఆమె బంధువులు 10 మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసింది. 2016లో బంజారాహిల్స్ లో ఆమెపై చీటింగ్ కేసు నమోదైంది ఇక జగిత్యాలలో రెండు కేసులు బుక్కయ్యాయి.



బితుకు ప్రసన్న రెడ్డి (నిందితురాలు)

**కరీంనగర్‌లో చిక్కిన కిలాడి**

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కరీంనగర్‌లోని శ్రీ విల్లీస్‌లో కంత్రీ కిలాడి ప్రసన్న రెడ్డి మధురానగర్ పోలీసులకు చిక్కింది. మోసాల్లో ప్రమేయం ఉన్న ఆమె భర్త రామలింగా రెడ్డి సైతం పోలీసులు పట్టుకున్నారు. కిలాడి లేడీ దంపతుల్ని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్ కు తరలించారు.

**మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

*ప్రభాకర్, మధురానగర్ ఇన్ స్పెక్టర్...*

విద్యార్హతలు, ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని.. డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్ళ మాటలు నమ్మొద్దని మధురానగర్ ఇన్ స్పెక్టర్ ప్రభాకర్ కోరారు. మాయ మాటలతో మోసాలు చేసే ఇలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## అప్పుడే పుట్టిన మగబిడ్డ బాలింత మృతి

బాలానగర్ : అప్పుడే పుట్టిన మగబిడ్డతో పాటు బాలింత మృతి చెందిన ఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ నరసింహారాజు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన అరుణ (22) కాన్పు కోసం కేపీహెచ్‌బీ కాలనీ నాలుగో ఫేస్‌లో ఉండే తల్లి దండ్రుల ఇంటికి వచ్చింది. శనివారం డెలివరీ నిమిత్తం వినాయక నగర్‌లోని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. అరుణకు ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది డెలివరీ చేశారు. అరుణ బెడ్‌పై పడిపోయారు. ఆమెను 108 లో గాంధీ దవాఖానకు తరలించగా.. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. అరుణకు జన్మించిన మగ బిడ్డ ఆరోగ్యం కూడా సక్రమంగా లేకపోవడంతో నిలోఫర్‌కు తరలించారు. శిశువు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అరుణ కుటుంబ సభ్యులు బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## సెల్లార్ తవ్వుతుండగా ఒకరు మృతి

మూసాపేట, మే 31: సెల్లార్ తవ్వుతుండగా మట్టికూలి ఒకరికి గాయాలు, మరొకరు మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్, మంచిరేవులకు చెందిన బొంత నరేశ్(46) శ్రీనివాస్ మూసాపేట వై జంక్షన్‌లో ఏఎస్‌బీ కన్‌స్ట్రక్షన్‌లో కూలి పనిచేస్తుంటారు. శనివారం సెల్లార్ తవ్వుతుండగా ప్రమాదవశాత్తు మట్టి కూలడంతో నరేశ్, శ్రీనివాస్ చిక్కుకున్నారు. వెంటనే తోటి కూలీలు మట్టిని తొలగించగా నరేశ్‌కు ఇనుప చువ్వ గుచ్చుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో దవఖానకు తరలించారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## టిప్పర్ ఢీకొని యువకుడు..

శేరిలింగంపల్లి : టిప్పర్ ఢీ కొని యువకుడు మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై మహేశ్ గౌడ్ తెలిపిన ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం మండలం, కందులపాలెంకు చెందిన దుర్గా కిరణ్ (25) నగరానికి వలస వచ్చి గచ్చిబౌలి పీజేఆర్ నగర్‌లో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. వరుసకు సోదరుడు వెంకట దుర్గాప్రసాద్‌తో కలిసి శనివారం తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై బీరంగూడకు బయలుదేరారు. ట్రిపుల్ ఐటీ సమీపంలోకి వెళ్లగానే వెనక నుంచి వేగంగా దూసుకు వచ్చినా టిప్పర్ ఢీ కొట్టడంతో ఇద్దరు ఎగిరి కిందపడ్డారు. బైక్ నడిపిస్తున్న దుర్గా కిరణ్ కు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని కేర్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బైక్ కూర్చున్న వెంకట దుర్గా ప్రసాద్ కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దుర్గా కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాత కక్షలతోనే వ్యక్తి హత్య..

### ఇద్దరు నిందితులు అరెస్ట్

కుత్బుల్లాపూర్, మే 31: పాత కక్షలతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పేట్ బషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన డానిస్(25)కు, అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ బిలాల్ (28)కు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బిలాల్ తన స్నేహితుడు అస్లాంతో కలిసి.. దానిష్‌ను సూరారం కట్ట మైసమ్మ వద్దకు మాట్లాడుకుందామని చెప్పి రప్పించారు. మద్యం సేవించిన అనంతరం ఇరువురి మధ్య మళ్లీ గొడవ జరగడంతో బిలాల్, అస్లాంలు కలిసి కత్తితో డానిష్‌ను పలుమార్లు పొడిచాడు. బండరాయితో తలపై మోది చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి వెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

### ప్రిజం పబ్‌లో గొడవ

శేరిలింగంపల్లి : నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌లో గలాట చోటుసుకుంది. కేక్ విషయంలో ఓ సినీ నటికి పబ్ సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుందని ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. శుక్రవారం రాత్రి బర్త్ డే జరుపుకునేందుకు ఓ నటి స్నేహితులతో ప్రిజం పబ్‌కు వెళ్లింది. కేక్ విషయంలో సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని, డ్రగ్ ఎడిక్ట్ అంటూ దూషించారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు. ఓ నటి గొడవ చేస్తుందని పబ్ నిర్వాహకులు డయల్ 100 కాల్ చేయగా పోలీసులు వెళ్లి నచ్చచెప్పి వెళ్లారని ఆయన పేర్కొన్నారు.

## కాలనీల్లో సౌకర్యవంతంగా రహదారుల నిర్మాణం



మియాపూర్, మే 31: కాలనీలలో సౌకర్యవంతంగా రహదారుల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు హైదర్‌నగర్ కార్పొరేటర్ శ్రీనివాసరావు అన్నారు. వెస్టర్న్ హిల్స్ అడ్డగుట్ట కాలనీలో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



బాలానగర్, మే 31 : దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ అన్నారు. శనివారం ఫతేనగర్‌లో ఎంటామాలజీ అధికారులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌కు కార్పొరేటర్ విచ్చేశారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని వాటి నివారణకు ఫాగింగ్ చేయాలని సూచించారు. లేకుంటే పజలకు విష జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయని, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఫాగింగ్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటామాలజీ ఏఈ సోని, స్థానికులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The general public are hereby informed that our client Mr. Mohammed Sameeruddin Suhel, S/o. Mohammed Nazeeruddin Taher, R/o. H.No. 12-2-800/105, Dilshad Nagar Colony, Rethi Bowli, Near Madina Masjid, Mehdipatnam, Asif Nagar, Hyd-028 with an intend to purchase House i.e., bearing No. 3-70/4, in Survey No. 29/Part & 30/Part, admeasuring 200 Sq.Yards equivalent to 167.22 Sq. Meters out of (1920.00 Sq.yards) situated at Khajaguda Village, Serilingampally Mandal and Municipality, Ranga Reddy District, Telangana from its lawful owner Durdana Begum D/o. Late Hussain Bin Omer represented by her GPA Holders 1) SVS Associates, Developers & Builders, 2) S.S.Azmathullah Hussaini S/o. Syed Samiullah Shah Hussaini., who having acquired the same by virtue of registered partition deed bearing Doc No. 1819/2019 dt: 23-05-2019 and accordingly got presented the sale deed for registration on 17-08-2020 but surprisingly the same was kept pending vide No. P/813/2020 as the PTIN number was not tallying with the owners name, that having enquired all these years there is no other claimant in respect of the House bearing No. 3-70/4, in Survey No. 29/Part & 30/Part, admeasuring 200 Sq.Yards equivalent to 167.22 Sq. Meters out of (1920.00 Sq.yards) situated at Khajaguda Village, Serilingampally Mandal and Municipality, Ranga Reddy District, and due to some oversight the PTIN number was wrongly mentioned in the GHMC Records.

Therefore the general public are hereby inform that any person or persons including Banks and financial institutions having any kind of objection, right, claim or interest or title by way of mortgage or pledge or in any other manner in respect of the above said property, such person/persons shall put forth their claims/objections if any to the undersigned within 7 days from the date of publication of this notice, along with documentary evidence in person, otherwise our client shall proceed with the sale transaction of the house property and get the sale deed registered as per law in his favour and any claim or objection thereafter shall be deemed to have been waived.

Sd/- **P.SRINATH**
Advocate
103, Sunanda Apartment, Opp: T.V.Tower,
Malakpet, Hyderabad - 500036
**Cell No.9391018296, 9985111545**